జిల్లా కేంద్రం చేయాలని వినతి

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో వెలసి ఉన్న భక్తకన్నప్ప ఆలయంలో వినతిపత్రం అందజేసి తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జెఎసి సభ్యులు మాట్లాడుతూ అన్ని వసతులు కలిగి అన్ని మండలాలకు కేంద్ర బిందువుగా ఉన్న రాజంపేటను అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రకటించేలా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రికి మనసు మార్చాలని వేడుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజంపేట మండల కేంద్రంలో రాజంపేటను జిల్లా కేంద్రంగా చేస్తామని, వైద్య కళాశాలను తీసుకొస్తామని నాటి ప్రతిపక్ష నేత, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి సభ్యులు పూల భాస్కర్, ప్రభాకర్ నాయుడు, లక్ష్మీనారాయణ, రెడ్డి నాయుడు, నందగోపాల్, రవీంద్రబాబు, మహదేవయ్య, చల్లా సుధాకర్, ఊటుకూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

'దిత్వా'.. గుబులు!

- కడప, అన్నమయ్య జిల్లాల్లో చిరుజల్లులు

- రాజంపేట, రైల్వేకోడూరు, బద్వేల్ డివిజన్లకు తుపాన్ హెచ్చరిక

- నేడు ఉమ్మడి జిల్లాలో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు

- బుడ్డశనగ, వరి రైతుల్లో ఆందోళనలు

- చిట్వేల్‌లో అత్యధికంగా 41.2 మి.మీ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

దిత్వా తుపాన్ గుబులు రేపుతోంది. కడప, అన్నమయ్య జిల్లాల్లో శనివారం సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమైంది. చల్లని గాలులు, చిరుజల్లులతో కూడిన వర్షం రైతులను భయాందోళనకు గురి చేస్తోంది. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఉభయ జిల్లాల అధికార యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో తీసుకోవాల్సిన నష్ట నివారణ చర్యలపై దృష్టి సారించాయి. ఇందులోభాగంగా వాతావరణశాఖ ఫోర్ క్యాస్ట్‌లో తీవ్ర హెచ్చరికల నేపథ్యంలో కడప ఉమ్మడిజిల్లా కలెక్టర్ సోమ వారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించారు. దీంతోపాటు జిల్లాలోని వాగులు, వరదల ప్రాంతాల్లో ఇరిగేషన్ ఇంజినీర్లను అప్రమత్తం చేశారు. జెసిబిల సహాయంతో కాల్వల్లోని అడ్డంకులను తొలగించే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఐఎండి ఫోర్‌క్యాస్ట్‌లో జిల్లాలోని రాజంపేట, రైల్వే కోడూరు, కడప జిల్లా బద్వేల్ డివిజన్ పరిధిలోని పోరుమామిళ్ల, కలసపాడు, గోపవరం, బి.కోడూరు మండలాల్లో తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉన్నట్లు హెచ్చరిస్తోంది. ఇందుకు అనుగుణంగానే ఆదివారం సాయంత్రానికి చిట్వేలి మండలంలో 41.2 మి.మీ, కడప జిల్లా జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని రాజుపాలెం మండలంలో 5.6 మి.మీ మేర అత్యధిక వర్షపాతం నమోదైంది. ఆదివారం రాత్రితీరం దాటితే తుపాన్ తీవ్రత గురించి తెలిసే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ఇదిలాఉండగా మరో నాలుగు రోజులపాటు దిత్వా తుపాన్ కొనసాగే అవకాశాలున్నాయనే హెచ్చరికల నేపథ్యం భయాందోళనకు గురి చేస్తోంది. దీంతో కడప, అన్నమయ్య జిల్లాలోని బుడ్డశనగ, వరి రైతుల్లో ఆందోళన నెలకొంది. అన్నమయ్య జిల్లాలో 3,500 ఎకరాల్లో వరి, కడప జిల్లాలో 10 వేల ఎకరాల్లో వరి పంట కోత దశలో ఉంది. కడప జిల్లాలో మరో రెండు, మూడు వేల ఎకరాల్లో వరి దిగుబడిని రహదారులపై ఆర బెడుతున్న సంగతి తెలిసిందే.దీంతోపాటు కడప జిల్లాలో 82 వేల ఎకరాల నుంచి లక్ష ఎకరాల వరకు బుడ్డశనగ పంటను సాగు చేసే రైతుల్లో ఆందోళన నెలకొంది. ఐఎండి హెచ్చరికల ప్రకారం రాబోయే నాలుగు రోజుల వరకు దిత్వా తుపాన్ ప్రభావం కొనసాగితే భూమిలోని బుడ్డశనగ విత్తనం దెబ్బతినే అవకాశం ఉందనే భయాందోళనకు గురవుతున్నారు.

రంగంలోకి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

ఎస్‌పి నచ్చికేత్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో దిత్వా తుపాన్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు రక్షణగా నిలిచినందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం సిద్ధంగా ఉందని చింతకొమ్మదిన్నె సిఐ బాల మద్దిలేటి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ దిత్వా తుపాన్‌గా మారి వర్షాలు కురుసే ప్రభావం ఉన్నందున వరదలు సంభవించినప్పటికీ ఎటువంటి ప్రాణా నష్టాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందస్తు చర్య చేపట్టామన్నారు. అందులో భాగంగా చింతకొమ్మదిన్నె మండల పరిధిలో బుగ్గ వంక డ్యాం ఉన్నందున బృందం తో కలిసి బుగ్గ వంక పరిసర ప్రాంతాలను పరిశీలించామని చెప్పారు. వరదలు సంభవించే ప్రమాదమున్నప్పుడు వారికి తాము ఉన్నమంటూ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. విజయవాడ నుంచి ఎన్‌డిఆర్‌ఎఫ్ టెన్త్ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ మితిలేష్ యాదవ్ ఆధ్వర్యంలో 30 మంది బృందం మండలంలో సిద్ధంగా ఉందన్నారు. షెల్టర్ జోన్‌గా సికేదిన్నె మండలంలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. అందులో జె. కొత్తపల్లి జడ్‌పి హైస్కూల్, కృష్ణాపురంజడ్‌పి హైస్కూల్, ఊటుకూరు ఎంపిపి పాఠశాలల్లో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అక్కడ వైద్య బృందంతో పాటు ఆహార ఏర్పాట్లను కూడా సిద్ధంగా ఉంచామన్నారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం మాట్లాడుతూ వరదలు సంభవిస్తే ప్రజలను రక్షించేందుకు బోర్ట్స్, కట్టర్స్, రోప్స్, వంటి సామగ్రితో టీం సిద్ధంగా ఉన్నామంటూ పేర్కొన్నారు. ఎక్కడైనా ప్రమాదం సంభవిస్తే కలెక్టర్ ఇచ్చిన టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందజేస్తే వెంటనే తమ బృందంతో అక్కడికి చేరుకొని వరదల్లో చిక్కుకున్న వారికి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందంతో కలిసి మాట్లాడుతున్న సికె దిన్నె సిఐ బాలమద్దిలేటి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.తేజస్విని

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో గిరిజనలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియం చేసుకోవాలని జిల్లా గిరిజనుల సంక్షేమ శాఖ అధికారి పి. తేజస్విని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో గిరిజన జనాభా గిరిజన విద్యార్థుల పాఠశాలలు, వసతులు, నాణ్యమైన భోజనం ఎలా అందించాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆమె వివరించారు.

జిల్లాలో గిరిజనులు పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల వివరాలు తెలియజేయండి?

జిల్లాలో 12 గిరిజన గురుకుల పాఠశాల లున్నాయి. వాటిలో ఆశ్రమ 1, బాలికల 3, బాలురు 5, వసతి గృహాలు మొత్తం 3 ఉన్నాయి. బాలికల 2, బాలురు 1 ఉన్నాయి.

జిల్లాలో వార్డెన్లు, వంట మనుషులు వివరాలు తెలపండి? సిబ్బంది కొరత ఉందా?

జిల్లాలో వార్డెన్లు నలుగురున్నారు. వార్డెన్ల కొరతలేదు. వంట మనుషులు 12 మంది ఉన్నారు. వంట మనుషుల కొరత లేదు.

పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఈ ఏడాదిలో 9 పాఠశాలలో నూతనంగా డిఎస్‌సి ద్వారా 49 మంది ఉపాధ్యాయులు నియమితులయ్యారు. పదవ తరగతిలో విద్యార్థులకు నైపుణ్యమైన ఉపాధ్యాయులచే ప్రత్యేకమైన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ఉదయం, సాయంత్రం స్టడీ నిర్వహిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఏడాదిలో పదో తరగతి విద్యార్థులకు వంద శాతం ఫలితాలు సాధించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలో గిరిజనులు జనాభా ఎంత ?

జిల్లాలో గిరిజనుల జనాభా మొత్తం 65,106 (3.835) శాతం మంది ఉన్నారు.

గిరిజనులకు ఎటువంటి సహాయం అందిస్తున్నారు?

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఆధర్వంలో జిల్లాలో డిఎజెజియుఎ కింద నాలుగు మండలాలను గుర్తించడమైంది. పెనగలూరు మండలంలో కొండూరు చిన్నరాయసముద్రం, కోడూరు మండలంలో అనంత రాజుపేట, రాఘవరాజుపురం, వెల్లెలవారికండ్రిగ, ఓబనపల్లి, చియ్యవరం, కోడూరు (పడమర), కోడూరు (తూర్పు), ఉప్పరపల్లి, సెట్టిగుంట, కురబలకోట ముదివేడు, మట్టివారిపల్లి కురబలకోట, తెట్టు, అనగల్లు, ఎర్రగుడి, లక్కిరెడ్డిపల్లిలలో సంబందిత జిల్లా శాఖ అధికారులతో సమన్వయంతో ప్రతిపాదనలను రాష్ట్ర స్థాయి అధికారులకు పంపడమైంది.

గిరిజనులకు మౌలిక సదుపాయాలకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలోని గిరిజనులకు మౌలిక సదుపాయాల కోసం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

గిరిజనులకు, విద్యార్థులకు సలహాలు సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకోసం తరచూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. సదరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచనలు ఇస్తున్నాం. విద్యార్థులు ఉపాధ్యాయుల బోధనను శ్రద్ధగా ఆలకించి బాగా చదువుతూ మంచి మార్కులతో ఉతీర్ణత సాధించవచ్చు. వసతి గృహాలకు తనిఖీ వచ్చినప్పుడు వసతి గృహాలలో విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయవచ్చు.

హామీల అమలుకు కట్టుబడి ఉండాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పీలేరు

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడకపోతే ఉపాధ్యాయులను కూడగట్టి పోరాటాలకు సన్నద్ధమవుతామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ తెలిపారు. ఆదివారం స్థానిక తిరుపతి రోడ్డులో యుటిఎఫ్ పీలేరు డివిజన్ కార్యాలయాన్ని అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ముందుండి రాజీలేని పోరాటం చేసే సంఘం యుటిఎఫ్ అని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చిందని, ఆ హామీలు నిజమని నమ్మి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరిస్తే ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పూర్తిగా విస్మరిస్తోందని ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించిందని, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను చెల్లించకుండా వేధింపులకు గురిచేసిందని, రివర్స్ పిఆర్‌సి అమలు చేసి ఉద్యోగులను దగా చేసిందని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వం అని పేర్కొంటూనే గత వైసిపి ప్రభుత్వ బాటలోనే కూటమి ప్రభుత్వం కూడా నడుస్తోందని ఆరోపించారు. 12వ పిఆర్‌సి గడువు ముగిసి రెండేళ్లు దాటినా కనీసం ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామన్న హామీని సైతం కూటమి పెద్దలు మరిచినట్లున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు డిఎలు చెల్లించాల్సి ఉండగా కేవలం ఒక డిఎ మాత్రమే చెల్లించి సరిపెట్టడం తగదని అన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో బకాయిలన్నింటినీ చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగులకు మూడేళ్లుగా అందాల్సిన సరెండర్ లీవ్ చెల్లింపుల మాట ఏమైందని అడిగారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేస్తామని పదేపదే ప్రకటనలు చేస్తూ, మరోపక్క ఉపాధ్యాయులను నిరంతరం బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేయడం తగదన్నారు. ఉపాధ్యాయులను బోధనలకు దూరం చేయడమంటే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను అందకుండా చేయడమేనన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేసి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను రద్దు చేయించేందుకు కృషి చేస్తామన్న ప్రభుత్వం ఆ వైపుగా కృషి చేయకపోవడం సరికాదన్నారు. 25 ఏళ్ల పైబడి బోధనలో అనుభవమున్న ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ పరీక్ష రాయమనటం సహేతుకంగా లేదన్నారు. ఉపాధ్యాయుల్లో నెలకొని ఉన్న ఆందోళనను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని, అవసరమైతే విద్యాహక్కు చట్టాన్ని పార్లమెంటులో సవరించేందుకు కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడకపోతే ఉపాధ్యాయులను కూడగట్టి పోరాటాలకు సన్నద్ధమవుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు అక్రం బాష, బాస్కర్ రెడ్డి, ఆదినారాయణ, విజయకుమార్, పీలేరు డివిజన్ నాయకులు వెంకటరమణ, డివి రెడ్డి, ఉదయ్ కిరణ్, ప్రభాకర్, సుధాకర్, వివిధ మండలాల ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

స్కూల్ లైఫ్ సినిమాను ఆదరించండి

మాట్లాడుతున్న పులివెందుల మహేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బాల్యంలో స్కూలుకు వెళ్లిన నాటి స్మృతులను గుర్తుకు తెచ్చే సినిమా స్కూల్ లైఫ్ అని, రాయలసీమ ప్రాంత వాసిగా రాయలసీమ ప్రాంతంలో తీసిన ఈ స్కూల్ లైఫ్ సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలని సినిమా డైరెక్టర్, హీరో పులివెందుల మహేష్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం మదనపల్లె రవి సినిమా థియేటర్‌లో స్కూల్ లైఫ్ సినిమాను ప్రేక్షకులతో కలిసి వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోపులివెందుల మహేష్ మాట్లాడుతూ ఈ ప్రాంత వాసులు సైతం సినిమాలలో రాణించాలని, వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయాలన్న ఉద్దేశంతో తన ఆస్తులు అమ్ముకొని స్కూల్ లైఫ్ సినిమాను తెరకెక్కించడం జరిగిందన్నారు. సుమారు రూ.2 కోట్లు వెచ్చించి, ఒకటిన్నర నెలపాటు శ్రమించి 12 లొకేషన్ లలో ఈ సినిమాను తీశామన్నారు. ఇందులో సుమారు రాయలసీమ ప్రాంతవాసులు 200 మంది ఆర్టిస్టులు నటించారని, చిన్ననాటి స్మృతులను జ్ఞప్తికి ఈ సినిమాలో రైతు కష్టాలు, తల్లిదండ్రుల కష్టాలు, వారి పాత్ర ప్రతిదీ మనసుకు హత్తుకునేలా తీశామన్నారు. ముఖ్యంగా ప్రేమ అనేది ప్రతి ఒక్కరిలో ఉంటుందని, తల్లిదండ్రుల మీద చూపించే ప్రేమ ఒకలా, గురువుల మీద చూపే మరోలా, తోటి స్నేహితులతో ఇలా ప్రేమ అనే కోణం ఒకరి మీదే కాదు, మన చుట్టూ ఉండే ప్రతి ఒక్కరిమీద ఒకలా ఉంటుందన్న ఇతిహాసంతో ఈ సినిమా తీశామన్నారు. ఒక ఆడపిల్ల మీద మనం చెడు ఉద్దేశంతో చూసినప్పుడు మన ఇంట్లోనూ ఒక ఆడపిల్ల ఉందనే విషయాన్ని గ్రహించాలని విషయాన్ని చూపిస్తూ ఈ సినిమా తీయడం జరిగిందన్నారు. ఎంతో కష్టంతో సమాజానికి ఓ చక్కని మెసేజ్ ఓరియెంటెడ్ సినిమా తీశామని, మన ప్రాంతవాసులు ఈ సినిమాను ఆదరించడం లేదని దీంతో సినిమాను కొన్న డిస్ట్రిబ్యూటర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి రాయలసీమ ప్రాంత వాసులను ప్రోత్సహించే విధంగా సినిమాను ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో సినిమా ప్రొడ్యూసర్ గంగాభవాని, మదనపల్లె డిస్ట్రిబ్యూటర్ కొండపల్లి ఆనంద్, సినిమా విలన్ మదనపల్లెకు చెందిన నరేష్ (డిట్లూ భాయ్) పట్టణవాసులు శివరామ్, రెడ్డిమోహన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

సామాజిక సమస్యలకు అక్షరబద్ధం 'రాచపూటి'

ప్రజాశక్తి - కడప అర్బన్ : సామాజిక సమస్యల్ని, అందుకు తగిన పరిష్కార మార్గాల్ని అక్షరబద్ధం చేస్తున్న రచయిత రాచపూటి రమేశ్ అని నిఘా విభాగం సహాయ అధికారి డాక్టర్ సింగమాల చంద్రయ్య అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సిపిబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' 149వ సదస్సులో భాగంగా 'రాచపూటి రమేశ్ సాహిత్యం – సామాజికత' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సింగమాల చంద్రయ్య మాట్లాడుతూ రాచపూటి రమేష్ గొప్ప విద్వాంసుల కుటుంబంలో తిరుపతిలో పుట్టారన్నారు. తండ్రి సుబ్బారావు న్యాయవాదని, తల్లి పద్మావతమ్మ ఆరోజుల్లోనే ఎం.ఎ చదువుకున్న ఉన్నతవిద్యావంతురాలని చెప్పారు జౌళిశాఖలో ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన తన వృత్తిలో భాగంగా చూస్తున్న సమకాలీన సమస్యలపై ఎప్పటికప్పుడు తన రచనల్లో ప్రస్తావిస్తూనే ఉన్నారన్నారు. ఆయన అనేక కథలు, నవలలు రాశాం న్నారు. ముందుగా వక్త డాక్టర్ సింగమాల చంద్రయ్యను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది కలసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో రాచపూటి రమేశ్ సతీమణి వేదాల చంద్రవదన, నాగముని (మధుబాబు), కొండూరు జనార్దన రాజు, సుబ్బరాయుడు, శ్యామసుందర్ రెడ్డి, ముడియం కిశోర్, కుమార్, రఘునాథ రెడ్డి, మల్లేష్, దక్షిణామూర్తి, సునీల్ కుమార్, చెంచిరెడ్డి, వెంకటరమణ, కృష్ణచైతన్య, జార్జి, భరత్‌సింహ పాల్గొన్నారు.

'తొలి విషాద నాటక కర్త 'ధర్మవరం'

ప్రజాశక్తి- కడప అర్బన్ : ధర్మవరం రామకృష్ణమాచార్య రచించిన 'విషాద సారంగ ధర' తొలి తెలుగు స్వతంత్ర విషాద నాటకమని, వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ధర్మవరం 113వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ నాటక రచనలో ధర్మవరం వారు చేసిన ప్రయోగాలు అన్నీ, ఇన్నీ కాదని, నాటకాల్లో నటుల్ని దృష్టిలో పెట్టుకుని పాత్రని రూపొందించే సంప్రదాయానికి తెరతీశారని పేర్కొన్నారు. నాటకాల్లో పద్యాలకు, పాటలకు స్థానం కల్పించింది కూడా ఆయనేనని తెలిపారు. ధర్మవరం వారు నాటక కర్తకనే కాకుండా విలక్షణమైన నటుడని, ఆయన పాదుకా పట్టాభిషేకంలో దశరథుని పాత్ర పోషిస్తే దుఃఖాన్ని ఆపుకోలేక ప్రేక్షకులు ఏడ్చేవారని చెప్పారు. ప్రసిద్ధ రంగస్థల కళాకారులు దేవరశెట్టి గంగయ్య మాట్లాడుతూ ఆయన ఉన్మాద రాఘవ ప్రేక్షణీయం నాటకంతో మొదలుపెట్టి 30 పైగా నాటకాలు రాశారని పేర్కొన్నారు. చిత్రనళీయం ,పాదుకా పట్టాభిషేకం, విషాద సారంగధర, బృహన్నల, ఉషా పరిణయం, చిరకారి, వరూధిని తదితర ఎన్నో గొప్ప నాటకాలు రాశారని, ప్రతి నాటకం లో గొప్ప సామాజిక సందేశం ఇచ్చేవారని తెలిపారు. కార్యక్రమంలో హార్మోనిస్టు ఎడవల్లి రామలింగయ్య, తపలిస్టు గంగయ్య, రంగస్థల కళాకారులు బాల ఓబయ్య, ప్రకాష్ శర్మ, డి వెంకట సుబ్బయ్య, శ్రీనివాస రాజు, రమణ పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-రాయచోటి : రాయచోటి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగ న్వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ శశికళ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్త పోస్టు సంబేపల్లి మండల పరిధిలోని దేవపట్లలోని ఆవులవాండ్లపల్లి (విహెచ్), అంగన్వాడీ హెల్పర్ పోస్టులు రాయచోటి మండలంలో పరిధిలోని మాధవరంలో గల బొట్ల చెఱువు (ఎస్‌టి), సంబేపల్లి మండల పరిధిలోని శెట్టిపల్లిలో గల దిగువరాజు గారిపల్లి (విహెచ్) ఖాళీలున్నట్లు తెలిపారు. 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి, పదవ తరగతి పాసై, వివాహితులై స్థానిక నివాసం ఉన్న వారు అర్హులని తెలిపారు. డిసెంబరు 7వ తేదీలోపు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తులను అందించాలని సూచించారు.

నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి-రాయచోటి : దిత్వా తుపాన్ కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు డిఇఒ సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు వర్షాల కారణంగా విద్యుత్ పట్ల జాగ్రత్తలు పాటించాలని, పిల్లలకు చెరువులు, కుంటలు, కాలువలు, నదీ పరివాహక ప్రాంతాలకు వెళ్ళకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

సంఘసంస్కర్త గురజాడ

ప్రజాశక్తి-రాజంపేట : సంఘసంస్కర్త, మహాకవి గురజాడ వెంకట అప్పారావు 110వ వర్ధంతి వేడుకలు తెలుగు భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జౌళి బజారులో గల సరస్వతి విద్యా మందిరంలో నిర్వహించారు. సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ, మండల శాఖ అధ్యక్షులు బొట్టా రామచంద్రయ్య నాయుడు, తెలుగు ఉపాధ్యాయులు పి.శ్రీనివాసులు, పిఎల్‌ఎన్‌వి. ప్రసాదరావు, పి.నరేంద్ర కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక సాహిత్యానికి వేగుచుక్క వంటి వాడు గుర జాడ అని కొనియాడారు. తెలుగు సాహిత్యంలో తన అమూల్యమైన రచనల ద్వారా సమాజ పరివర్తన కోసం పరితపించిన మహానుభావుడన్నారు.

నకిలీ మద్యం కేసులో నిందితుల కోసం కస్టడీ పిటిషన్

ప్రజాశక్తి - ములకలచెరువు

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో అరెస్టయి మదనపల్లి సబ్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఇద్దరి నిందితుల కస్టడీ కోసం తంబళ్లపల్లి కోర్టులో ఎక్సైజ్ పోలీసులు శనివారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఎ24గా ఉన్న జీటిన్, ఎ 25, ఉన్న శిబూల కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులోనే మరో ఇద్దరి నిందితులను ఎక్సైజ్ పోలీసులు చేర్చారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌కు చెందిన సెందిల్‌నుఎ30గా , హైదరాబాద్‌కు చెందిన ప్రసాద్‌ను ఎ31గా చేర్చారు.

వైసిపి కౌన్సిలర్ల తీరు బాధాకరం

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గత వైసిపి పాలనలో మదనపల్లెను జిల్లాగా ప్రకటించకుండా రాయచోటి కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటు చేయడంలో వైసిపి నాయకుల పాత్ర క్రియాశీలకంగా ఉందని, నేడు కూటమి ప్రభుత్వం మదనపల్లెను జిల్లాగా ప్రకటిస్తే నిన్న జరిగిన మున్సిపల్ సమావేశంలో ధన్యవాదాల తీర్మానానికి వైసిపి కౌన్సిలర్లు అభ్యంతరాలు వ్యక్తం చేయడం బాధాకరమని టిడిపి నేతలు మండిపడ్డారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి కౌన్సిలర్ తులసీ రామకృష్ణ, ఆర్.జె.వెంకటేష్, పోతబోలు సుధాకర్, మాజీ కౌన్సిలర్ పులి మహాలక్ష్మి, మాజీ కౌన్సిలర్లు నీలకంఠ, రాధ, మోడెం సిద్ధప్ప లు మాట్లాడుతూ సుదీర్ఘ చరిత్ర కలిగిన మదనపల్లెను జిల్లాగా చేయకుండా గత పాలకులు మదనపల్లి ప్రజల మనోభావాలను కాలరాస్తూ రాయచోటి జిల్లాగా ప్రకటించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్,మంత్రినారా లోకేష్ సారథ్యంలో మదనపల్లి జిల్లాగా ప్రకటించడంలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాత్ర క్రియాశీలకమన్నారు. అనంతరం 20 వార్డు కౌన్సిలర్ తులసి రామకృష్ణ ఆచారి మాట్లాడుతూ మున్సిపల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్లు కనీసం జిల్లా ఏర్పడినందుకు ధన్యవాదాలు తీర్మానాన్ని కూడా లెక్క చేయకుండా సభ నుంచి వెళ్లి పోవడం బాధాకరమని, వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కేవలం కాలక్షేపానికి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నారని, ప్రజా సమస్యలను పట్టించు కోలేదన్నారు. అదేవిధంగా పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యేకు సహకరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మదనపల్లి నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా అహర్నిశలు శ్రమిస్తున్నారని ప్రశంసించారు. వైసిపి నాయకుల తీరును ఎవరూ హర్షించరని, వారి విధానాలు ఇలాగే కొనసాగితే ఆ పార్టీ భూస్థాపితం కాక తప్పదన్నారు. జిల్లా ఏర్పడ్డాక అభివృద్ధి అందరికీ సమానంగా అందు తుందని వైసిపి నాయకులు తెలుసుకోవాలని సూచించారు. జిల్లాను స్వాగతించకపోతే చరిత్ర హీను లుగా మిగిలిపోతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలు స్వామి, కె.వి.నాగరాజు, మాజీ కౌన్సిలర్ బాబునాయుడు, తలకాయల శీన, విజయమ్మ, జాఫరున్నిసా, నాగమణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు

ప్రజాశక్తి-రాయచోటి

సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని, ఉత్తమ సేవలు అందించడం ద్వారానే వారికి గుర్తింపు లభిస్తుందని నియోజక వర్గ టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మదనపల్లె రోడ్డులోని అజయ్ రెసిడెన్సిలో నిర్వహించిన రాయచోటి మండలం కాటిమాయకుంట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ బాబు ఉద్యోగవిరమణ సన్మాన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వృత్తులతో పోలిస్తే ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, లక్షలాది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గొప్ప బాధ్యత గురువులదేనని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకురాగలరని పేర్కొన్నారు. డిఇఒ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రవీంద్రనాథ్‌బాబు విద్యారంగంలో అందించిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి తన సేవా కాలం మొత్తం అంకితమై పనిచేశారని, వృత్తి నిబద్ధతతో అనేక తరాలకు మార్గదర్శిగా నిలిచారన్నారు.సన్మాన గ్రహీత రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ తన ఉపాధ్యాయ జీవితంలో సహచరులు, విద్యార్థులు, అధికారుల సహకారం ఎనలేనిదని తెలిపారు. గురువుగా సేవ చేసే అవకాశం లభించడం తన జీవితంలో గొప్ప అదృష్టమని అన్నారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, ఎపిఐఐసి డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు రామకృష్ణ, నాగముని రెడ్డి, ఆర్జెయుపి అధికార ప్రతినిధి ముత్తూజి వీరబ్రహ్మం, రాష్ట్ర అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు, జనరల్ సెక్రెటరీ షరీఫ్, ఎంఇఒలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్‌బాబు సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు

నాణ్యత ప్రమాణాలు పాటించాలి :'చమర్తి'

ప్రజాశక్తి-వీరబల్లి

పెట్రోల్ బంక్‌లో నాణ్యత ప్రమాణాలతో వినియోగదారులకు పెట్రోలును అందించాలని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ రాయచోటి-రాజంపేట రహదారి సీతంపేటలో హెచ్‌పి పెట్రోల్ బంక్ యజమాని కొండూరు నాగరాజు కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి, రాజంపేట సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా దగ్గరలో ఉన్న గ్రామాల ప్రజలకు వాహనదారులకు అందుబాటులో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం చాలా శుభ పరిణామమని చెప్పారు. మార్గమధ్యంలో పెట్రోల్, డీజిల్ దొరకక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు వాహనదారులకు పెట్రోల్ బంక్ చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. వాహనదారుల విషయంలో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వీరబల్లి మండల టిడిపి అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, వీరబల్లి సింగిల్‌విండో ప్రెసిడెంట్ అమరేశ్వరరాజు, నాయకులు మహేష్, కొండూరు మహేష్, టిడిపి భాస్కరరాజు, మైనార్టీ నాయకులు దస్తగిరి, ఇబ్రహీం, ఖాదర్ బాషా, రెడ్డి భాష, మోదిన్, కొత్తపల్లి మహేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకల్లో సింధూర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రతినిధులు

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెకు చెందిన ప్రముఖ సంగీత సంస్థ జయసింధూర్ ఎంటర్టైన్మెంట్స్ సంస్థ తమ 35 సంవత్సరాల విజయవంతమైన ప్రస్థానాన్ని ఆదివారం పట్టణంలోని శ్రీదేవి గార్డెన్స్ లో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు సోప్పరం రాజేశ్వరరావు, హేమంత్ తమ 35 ఏళ్ల సంగీత ప్రస్థానంలో కీలకమైన పాత్ర పోషించిన ప్రముఖ గీత రచయితలు, సంగీత దర్శకులు, గాయనీ గాయకులను సన్మానించారు. ఈ వేడుకల్లో ప్లేబ్యాక్ సింగర్స్ రాము, సింధు, గీత రచయితలు మద్దివేని శ్రీనివాసులు, సంగీత దర్శకులు కేఎల్ఎన్ మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ తమ సంగీత యాత్రను మరింత విస్తరించి, భారతీయ సంగీత రంగంలో విజయాలను సాధించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఆయా విభాగాల్లోని కళాకారులు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. పాటలు, స్వరాలు, బాణీలు, సంగీత నిర్మాణాలు ఈ సంస్థను ప్రేక్షకుల హృదయాల్లో విశేష స్థానం కల్పించాయని నిర్వాహకులు తెలిపారు.

మైఫోర్స్ మహేష్‌ను సన్మానిస్తున్న జనసేన నాయకులు

ఎపిఐఐసి డైరెక్టర్ మహేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

ఎపిఐఐసి డైరెక్టర్‌గా నియమితుల జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, తన వెంట నడిచిన జనసేన నాయకులు, వీర మహిళలు జనసేనకి కృతజ్ఞతలు తెలియజేయడానికి కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఎపిఐఐసి కార్యాలయం నుంచి ప్రారంభమై పట్టణ పురవీధుల మీదుగా నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు అమర్ నారా యణ, సర్దికూటి హరినాథ్, భవ్య కిషోర్ రామ్మూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో నూతనంగా ఎపిఐఐసి డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టిన మహేష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆకిపాటి సుభాషిని, తిరుపతి జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన నాయకులు పీలేరు నియోజకవర్గ జనసేన నాయకులు నక్క గోపీనాథ్, సుధాకర్, తంబాలపల్లి నియోజకవర్గం జనసేన నాయకులు మల్లికార్జున్, సందీప్ రెడ్డి, మధు రాయల్, నాగేంద్ర మనోజ్ పాల్గొన్నారు.

మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత కేన్సర్ వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పీలేరు : స్థానిక శ్రీశ్రీనివాస ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సర్వైకల్ కేన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని శ్రీ కాకతీయ కిడ్స్ కేర్‌లో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సాయంతో శ్రీశ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ పీలేరులో సంజీవిని ఉమెన్ హెల్త్ కేర్ పేరిట సర్వైకల్ కేన్సర్ అవగాహన, నిర్ధారణ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మెడిగో హాస్పిటల్ గైనకాలజిస్టులు, ఇతర వైద్య నిపుణులు 53 మందికి పాప్స్మియర్ వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. మహిళలకు గర్భాశయ సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యకరమంలో శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ డాక్టర్ పివి బ్రహ్మారెడ్డి, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి, డాక్టర్ జిలాని, డాక్టర్ షమీం, షబ్బీర్‌పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - లింగాల : విద్యార్థి దశ నుంచే పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యంగా ఉంటారని స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు సూచించారు. మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న అంబేద్కర్ బాలికల పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు రక్తగ్రాప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వంద మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ప్రతి మనిషి రక్తగ్రూప్ నిర్ధారణ తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంశివకేశమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై పశువుల బెడద

రోడ్లపై సంచరిస్తున్న పశువులు

ప్రజాశక్తి-రాజంపేట

మండల పరిధిలోని ఊటుకూరు, కూచివారిపల్లె గ్రామపంచాయతీల పరిధిలో ఆవులు, గేదెలు, ఎద్దులు విచ్చలవిడిగా తిరుగుతూ జనసంచారానికి పెద్ద ఆటంకంగా మారుతున్నాయి. ముఖ్యంగా డిబిఎన్ పల్లె పరిధిలో రోడ్లపై పశుసంచారం ఎక్కువగా ఉండడంతో స్థానిక ప్రజలకు అవరో ధంగా మారింది. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రోడ్లపై ప్రయాణించాలంటేనే బెంబేలెత్తుతున్నారు. రోడ్లపై గుంపులు గుంపులుగా పశు సంచారం వలన పలుమార్లు వాహన ప్రమాదాలు చోటు చేసుకున్నప్పటికీ పశు యజమానులు గానీ, అధికారులు గానీ స్పందించిన పాపాన పోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పశువులు గుంపులుగా తిరుగుతుండడంతో చిన్న పిల్లల్ని పాఠశాలకు పంపేందుకు కూడా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడు తోందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. పందులు సైతం గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలతో సహజీవనం చేస్తున్నాయని, ఇళ్లలోకి చొర బడి ఇబ్బందులకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఊటుకూరు, కూచివారిపల్లె గ్రామపంచాయతీ అధికారులు స్పందించి పశువులు, పందుల యజమానులకు నోటీసులు ఇచ్చి పశువుల బెడద నుంచి తమకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారే లేరు

రోడ్లపై పశువుల విచ్చలవిడి సంచారం వలన పలుమార్లు ప్రమాదాలు జరిగినప్పటికీ అటు పశువుల యజమానులు గానీ, ఇటు పంచాయతీ అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదు. పట్టణానికి అతి సమీపంలో ఉన్న మా గ్రామంలో కొందరు పశు యజమానులు రోడ్లపై పశువులను విచ్చలవిడిగా వదిలివేయడంతో స్థానికులు అనేక సమస్యలు ఎదుర్కో వాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఎంపిడిఒ స్పందించి పశువులను విచ్చలవిడిగా రోడ్లపై వదలకుండా యజ మానులకు నోటీసులు ఇచ్చి పశువుల బెడద నుంచి ఉపశమనం కలిగించాలి.

-తుమ్మలూరు హరికృష్ణ, రాజంపేట

చర్యలు తీసుకుంటాం : ఎంపిడిఒ

పశువుల బెడద గురించి ఎంపిడిఒ వరప్రసాద్ దృష్టికి తీసుకుపోగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. రోడ్లపై పశువులు సంచరించకుండా చర్యలు చేపడతామన్నారు.

హ్యాండ్‌బాల్ ఫైనల్‌లో చిత్తూరు జట్టు విజయం

ప్రజాశక్తి-కలికిరి

హ్యాండ్ బాల్ అండర్-14 ఫైనల్ పోటీలో చిత్తూరు జట్టు అత్యుత్తమ ప్రతిభ సాధించి వైజాగ్ జట్టును ఓడించి కప్పు కైవసం చేసుకుంది. మండల కేంద్రం కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హ్యాండ్ బాల్ అండర్ 14 పోటీలలో బాలుర విభాగంలో వైజాగ్ జట్టుతో 9-6 గోల్స్ తేడాతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో ప్రకాశం జిల్లా జట్టుతో 3-6 గోల్స్ తేడాతో కృష్ణాజిల్లా జట్టు విజేతగా నిలిచింది. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి రెడ్డివారి యోగేష్ రెడ్డి,జెఎన్‌టియు అసిస్టెంట్ డైరెక్టర్ శివప్రసాద్, కొత్త మంచూరు జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యా యుడు ప్రకాష్ పాల్గొని విజేత జట్టుకు బహుమతులు అందించి క్రీడాకా రుల ను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాస్థాయి హ్యాం డ్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్న అన్ని జట్టులు పోటా పోటీగా విశేష ప్రతిభ కనబరిచాయని వాటిలో రెండు జట్లుకు కప్పు వరించిందన్నారు. మూడు రోజులపాటు కలికిరిలోజరుగుతున్న పోటీలకు సహకరించిన పెద్దలకు అభి నందనలు తెలిపారు. కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల ప్రధానో పాధ్యా యురాలు జయమ్మ, స్టేట్ అబ్జర్వర్ వెంకటేశ్వరరావు, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ ఝాన్సీ, ఎన్టీఆర్ జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ శివప్రసాద్, పీడీలుపాల్గొన్నారు.

అండర్-14 హ్యాండ్‌బాల్ ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన చిత్తూరు జట్టు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుధాకర్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్ జీవితాలను నాశనం చేస్తాయని ప్రిన్సిపల్ సుధాకర్ అన్నారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా ఐదవ రోజు ఆదివారం మండలంలోని పంచాలమర్రిలో పొగాకు, డ్రగ్స్, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగంతో జరిగే అనర్థాలను వివరించారు. యువత చెడు అలవాట్లకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తుపదార్థాలు వినియోగంలో శారీరక, మానసిక రుగ్మతలు ఏర్పడి జీవితం చిన్నాభిన్నం అవుతుందన్నారు. యువత ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రశేఖర్, అధ్యాపకులు వెంకట్రాముడు పాల్గొన్నారు.

ఉమ్మడి సహకారంతోనే కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి

-ఎఐసిసి పరిశీలకులు మహేంద్రన్

ప్రజాశక్తి-కలికిరి

కార్యకర్తలు,నాయకులు ఉమ్మడి సహకారంతోనే కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చెందుతుందని ఎఐసిసి పరిశీలకుడు మహేంద్రన్ పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎస్ కల్యాణ మండపంలో కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి బాల్ రెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహేంద్రన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పైన నాయకులు, కార్యకర్తలతో సుదీర్ఘంగా చర్చించి వారి సూచనలు,సలహాలు తీసుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ఎన్నికకు ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. 17మంది కాంగ్రెస్ నాయకులు జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తులు సమర్పించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బాలిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి తో పాటు మరో 16 మంది దరఖాస్తు చేశారు. కార్యక్రమంలో పిసిసి స్టేట్ అబ్జర్వర్ జంగా గౌతం, డిసిసి అధ్యక్షులు గాజులు భాస్కర్, ఉపాధ్యక్షుడు చిన్న కృష్ణ, జిల్లా మాజీ కార్యదర్శి డాక్టర్ శ్రీవర్ధన్‌చౌదరి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు అమృతతేజ నాయకులు దుబ్బాక శ్రీకాంత్, రహంతుల్లా, మహబూబ్‌బాషాపాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి

పూర్తిస్థాయిలో నిండిన వేంపల్లి చెరువు

పరిశీలించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

చెరువు నుంచి కాలువల నీటి విడుదల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇటీవల కురిసిన వర్షాలకు మదనపల్లె సమీపంలోని వేంపల్లి చెరువు పూర్తిస్థాయిలో నిండింది. ఇరిగేషన్ అధికారులు, స్థానిక టిడిపి నేతలతో కలిసి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదివారం వేంపల్లి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులోని నీటిని కాలువ ద్వారా రైతులు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమృద్ధిగా కురిసిన వర్షాలకు చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయని రైతుల పంటలకు సమృద్ధిగా నీరు అందించే కార్యక్రమం రానున్న కాలంలో చేపట్టవచ్చునని తెలిపారు. చెరువు కింద ప్రాంతాలలో బోర్ల నీటి సామర్థ్యం పెరిగి పంటలకు సరిపడా నీరు అందించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎంపి డిఒ తాజ్‌మాస్రూర్, ఎఒ నవీన్ కుమార్, టిడిపి నాయకులు జంగాల వెంకటరమణ, బైగారి రాజానాయుడు, వినోద్ కుమార్, కార్యకర్తలుపాల్గొన్నారు.

ప్రతిభ నమూనా పరీక్షలు నైపుణ్యాలకు కొలమానాలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రతిభ నమూనా పరీక్షలు విద్యార్థుల నైపుణ్యాలకు కొలమానాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని అహో బిలపురం ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ నమూనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో ఎంతో ప్రతిభా పాట వాలు గల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని, విద్యార్థుల ప్రతిభకు సాన పెట్టి, సుశిక్షితులైన ఉపాధ్యాయులు సరైన రీతిలో తర్ఫీదునిస్తే, కడప జిల్లాకు చెందిన శ్రీచరణి వంటి అత్యున్నత ప్రతిభావంతులు, అసాధారణ దీక్షాదక్షులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి రూ.15వేలు, లింగాల ఎంఇఒ చందా విశ్వనాథరెడ్డి రూ.2,500, వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సింగారెడ్డి అమర్నాథ్‌రెడ్డి రూ.2,500 ప్రతిభా నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. జాతీయ ఉపకార వేతన ప్రతిభా నమూనా పరీక్షకు నియోజకవర్గంలోని వివిధ హైస్కూళ్లల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్న 564 మంది విద్యార్థులు హాజరయ్యారు. సీనియర్ ఉపాధ్యాయుడు గుజ్జుల కృష్ణారెడ్డి నేతృత్వంలో సాంకేతిక నిపుణుల బృందం మూల్యాంకనం నిర్వహించి విజేతలను ప్రక టించారు. పులివెందుల గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని ఎస్.హిమశ్రీ మొదటి బహు మతి రూ.5వేలు, చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లె హైస్కూల్ విద్యా ర్థులు జి.వరుణ్ తేజ్, జి మైథిలి రెండవ, మూడవ స్థానాలు సాధించి రూ.3వేలు, రూ.2వేలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. మరో 20 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు కాన్సోలేషన్ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు వెంకటనాథ్ రెడ్డి, కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్, నియోజకవర్గ పరిధిలోని ఎంఇఒలు చంద్రశేఖరరావు, రామానాయుడు, విశ్వనాథరెడ్డి, రామకృష్ణయ్య, రామచంద్రారెడ్డి, అహోబిలపురం హైస్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు అమర్నాథరెడ్డి, సురేష్ రెడ్డి, రఘునాథరెడ్డి, జగన్, వెంకటరెడ్డి, చలమారెడ్డి, మదార్, సుభాష్ పాల్గొన్నారు.

మహాకవి సమ్మేళనంలో 'జింకా'కు సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అనంతపురం జిల్లా పరిషత్ హాల్‌లో ఆదివారం జరిగిన రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మహాకవి సమ్మేళనంలో ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ రచయిత జింకా సుబ్రహ్మణ్యం సన్మానం పొందారు. రాయలసీమ ప్రసిద్ధ ప్రదేశాల్లో 150 మంది కవులు పాల్గొని కవితా గానం చేసినట్లు జింకా స్థానిక విలేకరులకు ఫోన్ ద్వారా తెలిపారు. డల్లాస్ ఏరియా రాయలసీమ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కవి సమ్మేళనానికి అప్పిరెడ్డి పద్మనాభరెడ్డి అధ్యక్షత వహించి కవులను శాలువా, మెమెంటోతో సత్కరించారు. సమావేశానికి ముందు ప్రముఖ కవులు డాక్టర్ శాంతి నారాయణ, బండి నారాయణస్వామి, ఏలూరు వెంకన్న ప్రసంగించారు. కార్యక్రమంలో రాయలసీమ నలుమూలల నుంచి వచ్చిన కవులతో విజయవంతంగా ముగిసినట్లు జింకా తెలిపారు.

చమర్తితో మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

మండల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని టిడిపి మండల అధ్యక్షులు చప్పిడి రమేష్‌నాయుడు పేర్కొన్నారు. ఆదివారం రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజుతో కలిసి మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించినట్లు తెలిపారు. దిత్వా తుపాన్ ప్రభావం మండలం పై ఎలా ఉందని జగన్‌మోహన్‌రాజు ఆరా తీసినట్లు తెలిపారు. ఝరికోన కాలవలు, రాయచోటి-రాయవరం డబుల్ రోడ్డు పూర్తి చేయాలని రాష్ట్ర అధికార ప్రతినిధి మహేష్ నాయుడు, మాజీ టిడిపి మండల అధ్యక్షులు శివకుమార్ నాయుడు, కూటమి నాయకులతో కలిసి మాట్లాడినట్లు తెలిపారు. అనంతరం జగన్‌మోహన్‌రాజును దుశ్శాలువాతో సన్మానించారు.

అర్హులకు పిఎంఎవై నమోదు చేయిస్తున్న అధికారులు

వేగవంతంగా పిఎంఎవై నమోదు

ప్రజాశక్తి-కలికిరి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా అర్హులకు ఇళ్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసినట్లు కలికిరి పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేష్‌రెడ్డి తెలిపారు. నమోదుకు చివరి రోజు కావడం, గత రెండు మూడు రోజులుగా సర్వర్ సమస్య రావ డంతో చాలా మంది అర్హులు దరఖాస్తు చేసుకోక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. హౌసింగ్ ఎఇ చంద్రశేఖర్ రెడ్డి సహకారంతో కలికిరి పంచాయతీ పరిధిలోని సచివాలయం సిబ్బందితో రెండు రోజులపాటు సెలవు రోజైనా ఆదివారం కూడా నిర్విరామంగా పని చేసి అర్హుల ఇంటి వద్దకు వెళ్లి పిఎంఎవై పథకం కింద ఇళ్ల నమోదు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ ద్వారక, బూత్ కన్వీనర్ బావాజీ, రెడ్డప్ప, శివ, మహేష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

మదనపల్లె సమీపంలో గల ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఒంటిమిట్ట గ్రామంలో ఎన్ ఎస్ ఎస్ క్యాంప్ ప్రత్యేక శిబిరం చివరి రోజున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామ పరిసరాల్లో మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు విరివిరిగా పెంచాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రత పాటించాలన్నారు. మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారమని పేర్కొన్నారు. ఈ ఏడురోజుల ప్రత్యేక శిబిరంలో కంప్యూటర్ విద్య పై అవగాహన, ప్రభుత్వ పథకాలపై వివరణ, సైబర్ క్రైమ్స్ అవగాహన, డ్రగ్ ఫ్రీ అవగాహన, ఉచిత కంటి పరీక్ష శిబిరం వంటి పలు సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు గ్రామ పెద్దలు, గ్రామ స్తులు ఎన్ఎస్ఎస్ యూనిట్‌ను అభినందించారు. క్యాంప్ ముగింపు కార్యక్ర మంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామలింగ రెడ్డి, ప్రిన్సిపల్ డా.పి.రాయుడు పాల్గొని విద్యార్థుల సేవా భావాన్ని ప్రశంసించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వై.అరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా గ్రామ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజలలో సామాజిక అవగాహన పెంపు లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గ్రామస్తులు కూడా ఈ సేవా కార్యక్ర మాలకు సహకారం అందిస్తూ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల కృషిని అభినందించారు.

మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

క్రైం కార్నర్

మంటల్లో దగ్ధమవుతున్న కారు

పెట్రోలు లీకై కారు దగ్ధం

-తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని కదిరి రోడ్డులో గల రాయలసీమ స్కూల్ సమీపంలో ఆదివారం పెట్రోల్ లీకై సాంట్రో కారు దగ్ధమైంది. అప్రమత్తమై కారులో ప్రయాణిస్తున్న వారు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చూస్తుండగానే కారు క్షణాల్లో దగ్ధమైంది. ఈ సంఘటనలో కారు నడుపుతున్న కురవంకకు చెందిన రఘునాథ్ అతని సోదరి శ్రీదేవికి ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో నల్లగుట్టపల్లి పంచాయతీ బిసి కాలనీకి చెందిన బత్తల నరసింహ (33) అనే యువకుడు తన ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. మృతు గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ ఉండేవాడు నొప్పి బాధభరించడానికి మద్యానికి బానిస అయ్యాడని తెఇపారు. శనివారం కడుపునొప్పి ఎక్కువ కావడంతో నొప్పికి భరించలేక రాత్రి సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మ చేయించుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.